నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శుక్రవారం 31 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తవ్వాలి

### డీఈవో యాదయ్య



తాండూర్: దుస్తులను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేస్తున్న డీఈవో యాదయ్య, డీఆర్డీవో కిషణ్

తాండూర్, మే 30 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తవ్వాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. గురువారం తాండూర్ మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, ఏకరూప దుస్తుల కుట్టు తీరును డీఆర్డీవో కిషన్‌తో కలిసి పరిశీలించారు. మాదారం, కిష్టంపేటలోని కుట్టు కేంద్రాలను పరిశీలించి జూన్ 2వ తేదీలోగా ఏకరూప దుస్తులు అందజేయాలని సూచించారు. అనంతరం ఎంపీపీఎస్ మాదారం టౌన్‌షిప్, ఎంపీయూపీఎస్ చౌటపల్లి, కేజీబీవీ తాండూర్ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వాసాల ప్రభాకర్, ఏపీఎం పోమా నాయక్, ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులు పాల్గొన్నారు.



భీమారంలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

# తెలంగాణ చరిత్రకు సమాధి కడుతారా ?



- చిహ్నాన్ని చెరిపేసి.. గీతాన్ని మార్చాలనుకోవడం కుట్రలో భాగమే
- స్థానికేతరుడితో రాష్ట్ర గీతానికి మార్పులు, చేర్పులు సరికాదు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై మండిపడుతున్న మేధావులు, చరిత్రకారులు
- వెనక్కి తగ్గకుంటే ప్రజాగ్రహానికి గురికాకతప్పదంటూ హెచ్చరిక

మంచిర్యాల, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బకొడుతూ.. తెలంగాణ చరిత్రకు సమాధి కట్టాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నది. ఓరుగల్లు కేంద్రంగా పరిపాలన సాగించిన కాకతీయుల స్ఫూర్తి చిహ్నంగా ఉన్న కాకతీయ కళాతోరణం, ఎందరినో బలి తీసుకున్న ప్రాణాంతకమైన ప్లేగు మహమ్మారి అంతమైనందుకు గుర్తుగా నిర్మించుకున్న చార్మినార్‌లను రాజముద్ర నుంచి తీసేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. తెలంగాణ ఘనమైన చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే ఈ చిహ్నాలను రాజముద్ర నుంచి తొలగించడం సరికాదని, ఈ పనిచేసే ప్రభుత్వంపై యావత్ తెలంగాణ సమాజం తిరగబడక తప్పదని మేధావులు, చరిత్రకారులు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు. ఇక రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' పాటలోని చరణాల్లోనూ కాకతీయులు, గోల్కొండ ఆనవాళ్లు లేకుండా మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు తెలుస్తున్నది. పైగా తెలంగాణలో సంగీత దర్శకులు ఎవరూ లేనట్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ సినీ సంగీత దర్శకుడితో ఈ పాటను కంపోజ్ చేయించడంపై తెలంగాణ కళాకారులు, రచయితలు, సంగీత విద్వాంసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆనవాళ్లు లేకుండా చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ప్రజలు, కళాకారులు, రచయితల మనోభావాలతో ఆడుకంటూ రాజముద్రను మార్చడం, రాష్ట్ర గీతంలో మార్పులు చేయడం, ప్రాంతియేతరులకు సంగీత బాధ్యతలు అప్పగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### తెలంగాణ సమాజాన్ని అవమానించడమే..



ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ అస్తిత్వానికి పెద్దపీట వేశారు. బతుకమ్మ, బోనాల పండుగలు అధికారికంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతికి పట్టం కడుతూ జమ్మిచెట్టును రాష్ట్రవృక్షంగా, పాల పిట్టను రాష్ట్ర పక్షిగా గుర్తించారు. అదే సమయంలో ఎంతో మేధోమదనం, ఎందరో మహనుభావుల సలహాలు తీసుకొని కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లాంటి నిర్మాణాల మేళవింపుగా తెలంగాణ ప్రభుత్వ లోగోను రూపొందించారు. దాన్ని ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం మార్చాలని చూడడం ముమ్మాటికీ తెలంగాణ సమాజాన్ని అవమానించడమే. కేసీఆర్ చేసిన వాటన్నింటినీ మార్చాలనుకోవడం మూర్ఖత్వం తప్ప మరొకటి కాదు. ఇప్పటికైనా ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాకతప్పదు.

**- దుర్గం చిన్నయ్య, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే**

### చిహ్నాలను తీసేసి సాధించేది ఏమిటి?



రాష్ట్రానికో చరిత్ర ఉంటది. వాటిని వారసత్వంగా తీసుకువచ్చి భావితరాలకు అందిస్తాం. చరిత్రను ఆధారంగా చేసుకొని మన భవిష్యత్తు తరాలు ముందుకు పోతుంటాయి. అలాంటి తెలంగాణ చరిత్ర నుంచి వచ్చినవే కాకతీయ కళాతోరణం, చార్మినార్. ఆ చిహ్నాలను రాజముద్ర నుంచి తీసేసి రేవంత్‌రెడ్డి సాధించేది ఏమిటో అర్థం కావడం లేదు. రాష్ట్రంలో ఉన్న అసలు అతి పెద్ద సమస్య ఇదేనా.. సాగు, తాగు తాగునీరు లేక జనాలు రోడ్ల మీదకు వస్తుంటే అవేవీ పట్టించుకోకుండా రాజముద్రలు మారుస్తూ, పాటలు పాడిస్తూ గడుపుతున్నారు. తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డిని సీఎం చేసింది ఉన్న ఆనవాళ్లు తీసేయమని కాదు. పాలించడం చేతగాక ఇలా డైవర్షన్ పాలిటిక్స్‌ను ముందు వేసుకుంటున్నారు. ఎవ్వరైనా చరిత్రను కాపాడుకుంటారు.. కానీ నాశనం చేయాలని చూడరు. తెలంగాణ బలి దేవత సోనియా గాంధీ అని మాట్లాడిన రేవంత్‌రెడ్డే ఈ రోజు ఆమెను తెలంగాణ తల్లి అని చెబుతున్నడు. కేసీఆర్ మీద కోపం ఉంటే ఆయన మీదే చూపించాలి. కానీ తెలంగాణ సమాజం మీద, చరిత్ర మీద ప్రతీకారం తీర్చుకోకూడదు.

**- గోగుల రవీందర్‌రెడ్డి, ప్రముఖ వక్త**

### సరైన నిర్ణయం కాదు



రెబ్బెన, మే 30 : తెలంగాణ రాష్ట్ర రాజముద్రను మార్చడం సరైనది కాదు. వందల ఏళ్ల సంస్కృతికి చిహ్నాలు అయిన కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లను తొలగిస్తే చరిత్ర వైభవాన్ని మనమే నాశనం చేసుకున్న వాళ్లం అవుతాం. కాంగ్రెస్ సర్కారు నిర్ణయం మార్చుకోవాలి. పాత వాటినే కొనసాగించాలి.

**- వినోద్‌జైస్వాల్, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుడు, రెబ్బెన**

### ఉద్దేశపూర్వకంగానే కుట్ర



దహెగాం, మే 30 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని ఇప్పటి సర్కారోళ్లు ఉద్దేశపూర్వకంగానే మార్చాలని కుట్ర చేస్తున్నరు. కాకతీయుల కళాతోరణం, చార్మినార్ తెలంగాణ ప్రతీకలు. వాటిని మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది. అప్పటి ప్రభుత్వం చిహ్నాన్ని ఏర్పాటు చేసినప్పుడు ప్రజలనుంచి, మేధావులనుంచి, కవులు, కళాకారులనుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. అంటే అంగీకరించినట్లే కదా. తెలంగాణ మార్చాల్సింది చిహ్నం కాదు. పేదరికాన్ని పూర్తిగా మార్చాలి. అభివృద్ధిపై దృష్టిపెట్టాలి.

**- రాపర్తి ధనుంజయ్,సీనియర్ జర్నలిస్ట్, బీజేపీ మండల అధ్యక్షుడు**

# నిప్పుల కుంపటి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడి ఉగ్రరూపం
- రాష్ట్రంలోనే అత్యధికంగా భీమారంలో 47.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనం

మంచిర్యాల, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిప్పుల కుంపటిని తలపిస్తున్నది. భానుడి ఉగ్రరూపం దాల్చడంతో ప్రజానీకం అల్లాడిపోతున్నది. గురువారం ఎండదంచికొట్టగా రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మంచిర్యాల జిల్లా భీమారం మండలంలో గురువారం 47.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం కుంచవెల్లిలో 46.6, కాగజ్‌నగర్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో 45.2, నిర్మల్ జిల్లా దస్తురాబాద్(బుట్టాపూర్)లో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. ఉదయం 7 గంటల నుంచే చంద్రుడు నిప్పులు కురిపించగా, అత్యవసర పరిస్థితులుల్లో తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. రాత్రి 8 గంటల దాకా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



మంచిర్యాల : ఎండ వేడిమికి తట్టుకోలేక దాహం తీర్చుకుంటున్న స్థానికులు

## వడదెబ్బతో యువకుడు మృతి



సూర్యకిరణ్( ఫైల్ )

కాసిపేట, మే 30: కాసిపేటకు చెందిన సూర్యకిరణ్ (35) మంగళవారం వడదెబ్బతో తీవ్ర అస్వస్థతతకు గురయ్యాడు. బుధవారం రాత్రి వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఆటోలో దవాఖానకు తరలిస్తుండగా ఫిట్స్ వచ్చి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సూర్యకిరణ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

# అది అక్రమ వెంచరే..!

- భీమారం వెంచర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు
- 'అక్రమాల చంద్రుడిని అడ్డుకునేదెవ్వరు' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్



భీమారంలోని వెంచర్‌లో ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది

భీమారం, మే 30 : భీమారం మండల కేంద్రంలోని స్థానిక పెట్రోల్ పంపు వెనుకాల ఉన్న వెంచర్ అక్రమమైనదంటూ అధికారులు గురువారం నోటీస్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ నెల 27న 'నమస్తే తెలంగాణ' లో 'అక్రమాల చంద్రుడిని అడ్డుకునేదెవ్వరూ' శీర్షికన కథనం ప్రచురితమవ్వగా అధికారులు స్పందించారు. డీపీవో ఆదేశాల మేరకు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సర్వే నంబర్‌లో ఏర్పాటు చేసిన ప్లాట్లు అక్రమమైనవని, జీవో 67 అనుమతులు పొందలేదని, కొనుగోలు చేసిన వారికి గృహనిర్మాణాల కోసం అనుమతులు ఇవ్వమని, నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని అందులో వివరించారు. కాగా, పంచాయతీ కార్యదర్శి ఆ వెంచర్‌లో ఫ్లెక్సీ ని ఏర్పాటు చేసి, ఆపై ఫొటో తీసి నమస్తే తెలంగాణ విలేకరికి పెట్టారు. ఆ తర్వాత ఫ్లెక్సీ ని తొలగించారు. ఫ్లెక్సీ కనిపించడం లేదని విలేకరి అడుగగా, మళ్లీ గంట తర్వాత వచ్చి ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ఈ పెంట నాకు తగలపెట్టారని, వెంచర్ నిర్వాహకులతో పాటు మరి కొంత మంది కాంగ్రెస్ నాయకులు నిత్యం ఫోన్ చేస్తున్నారని, ఇది మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన వెంచర్ అని, ఇది ఎమ్మెల్యే అనుచరులదంటున్నారని ఆయన 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

# మెరుగైన వైద్యమందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- పీహెచ్‌సీ వైద్యాధికారికి షోకాజ్ నోటీస్



అడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 30 : రోగులకు మెరుగైన వైద్యమందించాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం అడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ, మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కాన్పులు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఔషధ గిడ్డంగిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బతో వచ్చే రోగుల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫ్లూయిడ్స్ నిరంతరం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పాముకాటు సంబంధిత వ్యాక్సిన్, మందుల స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎలాంటి చెత్త పేరుకుపోకుండా చూడాలని, ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలన్నారు. సిబ్బంది పనివేళలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసిస్టు, ఏఎన్ఎంలు ఎలాం టి అనుమతుల్లేకుండా మూడు రోజులకు విధులకు హాజరు కానందుకు, అలాగే అటెండెన్స్ రిజిస్టర్, సెలవు రికార్డు సరిగా లేకపోవడంతో మండిపడ్డారు. పీహెచ్‌సీ వైద్యాధికారికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

- ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు అమ్మొద్దు
- ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూం నం : 6304686505లో సంప్రదించాలి
- పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభించాలి
- జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే


ఆసిఫాబాద్ టౌన్,మే 30 : విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 38 వేల ఎకరాల్లో రైతులు పత్తి పండిస్తున్నారని, విత్తనాల కొరత లేదని, విత్తన డీలర్ల వద్ద ప్రస్తుతం సరిపడా స్టాకు ఉందని, జూన్ 25వ తేదీ వరకు విత్తనాలు డీలర్ల వద్ద లభిస్తాయన్నారు. జిల్లాకు 6 లక్షల 50 వేల ప్యాకెట్లు అవసరం కాగా, ప్రస్తుతం 5 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు విడిగా విత్తనాలు తీసుకోకుండా, కంపెనీ లోగో ఉన్న విత్తనాల ప్యాకెట్లనే కొనుగోలు చేయాలని, రైతులు విత్తనాలు వేసిన తర్వాత ఖాళీ బ్యాగులు, రశీదులను భద్రపరుచుకోవాలన్నారు. లైసెన్సు కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు అమ్మితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. డీలర్లు లైసెన్సు వివరాలు, విత్తన వివరాల నిల్వలను షాపు ముందు బోర్డుపై ప్రదర్శించాలని తెలిపారు. విత్తనాల నిల్వలు, ఏయే కంపెనీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి, వాటి ధరల పట్టికను ప్రతి రోజూ షాపు ముందు ప్రదర్శించాలని చెప్పారు. మండలాల్లో, రెండు డివిజన్లలో పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు ఏడుగురిపై కేసులు నమోదు చేసి, రూ. 26.50 లక్షల విలువైన 10 క్వింటాళ్ల విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పత్తి విత్తనాల అక్రమ రవాణా, అధిక ధరలు, నాసిరకం విత్తనాలు డీలర్లు విక్రయించినట్లయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 6304686505కు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, జిల్లా పౌరసంబంధాల అధికారి సంపత్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సంచాలకులు పాల్గొన్నారు.

### పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభించాలి

పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభించాలని, బడీడు పిల్లలు స్కూళ్లకు వచ్చేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మండల, జిల్లా సమైక్య అధ్యక్ష కార్యదర్శులు, సెర్ప్, మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు త్రివేణితో కలిసి పాల్గొన్నారు. జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యతో పాటు 6 నుంచి 10వ తరగతి పిల్లలకు నోటు పుస్తకాలు, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వర్క్ బుక్స్, యూనిఫాంలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉదయం పూట బలవర్ధకమైన అల్పాహారం, రాగిజావ, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. జూన్ 12న ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాలలను పండుగ వాతావరణంలో ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ రామకృష్ణ, మండల సమైక్య అధ్యక్ష కార్యదర్శులు, సెర్ప్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో స్పందించి.. యువకుడిని రక్షించి..

### సెల్ఫీ వీడియో ఆధారంగా ప్రశాంత్‌ను కాపాడిన పోలీసులు



రైల్వే స్టేషన్ నుంచి ప్రశాంత్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

సిర్పూర్(టీ), మే 30 : ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియో తీసి పంపగా, దాని ఆధారంగా పోలీసులు రక్షించిన ఘటన సిర్పూర్(టీ) మండలకేంద్రంలో గురువారం జరిగింది. సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం. కాగజ్‌నగర్ మండలకేంద్రంలోని ఆదర్శనగర్‌కు చెందిన రంగు ప్రశాంత్ జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు కుటుంబసభ్యులకు సెల్ఫీ వీడియో పంపించాడు. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ వీడియో ఆధారంగా ప్రశాంత్ సిర్పూర్(టీ) రైల్వే ట్రాక్‌పై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐ రమేశ్ ఆదేశం మేరకు బ్లూకోల్ట్స్ సిబ్బంది కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు హాజీ అక్కడికి వెళ్లి రైల్వే ట్రాక్ వద్ద ఉన్న యువకుడిని పట్టుకున్నారు. అనంతరం ఎస్ఐ ప్రశాంత్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబసభ్యులకు అప్పగించారు. యువకుడిని రక్షించిన సిబ్బందిని కౌటల సీఐ సాదిక్ పాషా, ఎస్ఐ రమేశ్ అభినందించారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679